క్లుప్తంగా

రికార్డులు నమోదు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రకాశ్

కెరమెరి: అన్ని రకాల రిపోర్టులు నమోదు చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని ధనోరా పాఠశాలలను సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ రిపోర్టులు, సీసీఈ రిజిష్టరు పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. అనంతరం తరగతిగదిలో విద్యార్థులతో తెలుగు చదివించారు. నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

షీటీం సేవలు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలోని మహిళలు, విద్యార్థినులు ఎక్కడైనా ఆకతాయిల వేధింపులకు గురైతే తక్షణమే షీటీం సేవలను వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ షీటీం ఇన్చార్జి వెంకటేశ్వర్లు, మహిళా ఎస్సై శిరీష అన్నారు. ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావ్ పర్యవేక్షణలో షీటీం పోలీసులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ పర్యవేక్షించారు. ఆకతాయిలను గుర్తించి అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరైనా మహిళలు, విద్యార్థినులను ఆకతాయిల వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు లేదా షీటీం 8712670564 నంబర్‌కు ఫోన్ చేసి లేదా, వాట్సాప్ మెసేజ్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైతో పాటు షీటీం సిబ్బంది స్వప్న, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

నేడు మొక్కల పెంపకంపై సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వెదురు బొంగుల మొక్కల పెంపకంపై సమావేశం ఏర్పాటు చేసినట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి డీపీవో సారయ్య హాజరవుతున్నారని, వెదురు బొంగు మొక్కలు పెట్టేందుకు ఎంపికైన గ్రామాల సీసీలు, వీవోఏలు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

నర్సరీల పరిశీలన



ఖైరీలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని దేవాపూర్, ఖైరీ గ్రామ పంచాయతీలను గురువారం ఎంపీడీవో అంజద్‌పాషా సందర్శించి నర్సరీలను పరిశీలించారు. కొన్నిచోట్ల మొక్కలు జర్మినేషన్ కాకపోవడంతో తగు చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు శ్వేత, న్యానేశ్వర్, ఖైరీ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి ఉన్నారు.

కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా విశ్వేశ్వరరావు



విశ్వేశ్వరరావు

బెజ్జూర్: కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా మండలంలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొడుప విశ్వేశ్వరరావును నియమిస్తూ గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ కన్వీనర్‌గా నియమించడం పట్ల పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



నగదు అందిస్తున్న పోలీసు అధికారులు

ఆసిఫాబాద్అర్బన్: లింగాపూర్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ గణేశ్ నాయక్ కుటుంబానికి పోలీసు శాఖ చేయూత అందించింది. జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు జైనూర్ సీఐ రమేశ్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షులు విజయ శంకర్‌రెడ్డి అందించారు.

వేసవిలోనే దున్నేద్దాం!



కెరమెరిలో దుక్కి దున్నుతున్న ట్రాక్టర్

- కలుపు బెడద తగ్గించవచ్చు
- భూమి పొరల్లో ఉండే క్రిములు నశిస్తాయి
- విత్తనం ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు

కెరమెరి: పంటల సాగులో వస్తున్న మార్పులను, ఆధునిక పద్ధతులను ఎప్పటికప్పుడు అనుసరిస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చు. అన్ని రకాల పంటలు సాగు చేయడానికి వేసవిలో దుక్కులు దున్నితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. చాలామంది రైతులు పంట ఫలసాయాన్ని పొందగానే పొలాన్ని అలాగే వదిలేస్తారు. మళ్లీ ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమవుతారు. కెరమెరి మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 6,400 మంది రైతులు 29 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 24 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. వాంకిడి మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా 11,200 మంది రైతులు 40 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 30 వేల ఎకరాల్లో పత్తి పంటను పండిస్తున్నారు. వారం రోజులుగా ఆయా మండలాల్లో అక్కడక్కడ వానలు కురుస్తున్నాయి. వేసవిలో దుక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉంచుకుంటే భూమిలోని వేడి చల్లారుతుంది. ఆ తర్వాత విత్తనాలు విత్తితే ఆశించిన ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలివే..

- వేసవిలో దుక్కులు దున్నడం వల్ల కలుపు బెడద తగ్గించవచ్చు. దుక్కి సిద్ధం చేసుకోకుంటే కలుపు బాగా పెరిగి పోషక పదార్థాలు గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి.
- లోతుగా దుక్కులు దున్నడం వలన ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో కురిసే వర్షానికి నీరు భూమిలోకి నేరుగా ఇంకుతుంది. దీంతో నాటిన విత్తనం ఏపుగా పెరుగుతుంది. అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తుంది.
- భూమిలోని పొరల్లో దాగి ఉండే కీటకాల గుడ్లు పంటలకు చీడపీడలు ఆశించడానికి కారణమయ్యే శిలీంద్రాలు వేసవి దుక్కులకు నేల నుంచి బయటపడి ఎండ తీవ్రతకు చనిపోతాయి.
- భూమిలో కోశస్థ దశలో ఉన్న పురుగులు లార్వాలు, నేల పైభాగానికి రావడంతో కాకులు, కొంగలు, ఇతర పక్షులు వాటిని తింటాయి. దీంతో అన్నదాతలకు మేలు చేకూరుతుంది.
- గతంలో అన్నదాతలు ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి రెండు, మూడుసార్లు వేసవి దుక్కులు దున్నేవారు. పరిస్థితులు మారుతున్న కొద్దీ సాగుపై అవగాహన కల్పించే వారు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ఏటా పెట్టుబడులు అధికమవుతున్నాయి.
- రుతుపవనాలు ప్రారంభం కాగానే హడావిడిగా దుక్కులు సిద్ధంచేసి వెంటనే విత్తనాలు నాటుతున్నారు. దీంతో మొలకల శాతం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది.

లోతుగా దున్నాలి



వేసవిలో దుక్కులు లోతుగా దున్నడం వలన అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. భూమి వేడి చల్లారక ముందు విత్తనాలు విత్తుకోవద్దు. భూమిలో వేడి చల్లారిన తర్వాత విత్తితేనే మొక్కలు ఆరోగ్యంగా ఎదిగి దిగుబడులు పెరుగుతాయి. సాగుకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే ఏఈవోల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు.

– ఎస్.గోపీకాంత్, ఎంఏవో, వాంకిడి

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

- ఏఎస్పీ చిత్తరంజన్



తాగునీరు ఇస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సీఐ బుద్దె రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

ఎండల నుంచి ఉపశమనం కోసమే..

రెబ్బెన: మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎండల నుండి ఉపసమనం కలిగించేందుకే పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్దెస్వామి, ఎస్సై చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోశ్, నాయకులు రమేశ్, సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, నవీన్, దేవాజీ, శంకరమ్మ, అహల్యాదేవి, అన్నపూర్ణ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని హట్టి బస్టాండ్ ప్రాంతంలో గురువారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై గుంపుల విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రయాణికుల దాహం తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులతో పాటు సాధారణ ప్రజలు చల్లని నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నెరవేరని తులం బంగారం హామీ

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జైనూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జైనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చిన తులం బంగారం హామీ నెరవేర్చకుండా మాయమాటలు చెప్పడం సరికాదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా దేవుగూడలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు) తహసీల్దార్‌లు ఆడ బీర్షావ్, ఉదయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, మాజీ ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆసిఫాబాద్అర్బన్: ఈనెల 12న జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకలకు హాజరు కావాలని గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావ్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుండా వెంకన్న, ధర్మపురి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పిన్నా వివేక్, మధు, రాధాక్రుష్ణచారి, మురళీగౌడ్, లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్

జైనూర్: నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని గౌరి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు రహదారి నియమాలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. హెల్మెట్ ఉపయోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

చపరాడ ఆలయంలో భక్తుల పూజలు



పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారులు

చింతలమానెపల్లి: చపరాడ ప్రశాంతధాం హనుమాన్ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలోని చపరాడ ప్రశాంతధాం ఆలయం ప్రాణహిత నదీ తీరంలో ఉంది. ఇక్కడికి హనుమాన్ మాల స్వీకరించిన భక్తులు ఏటా భారీ సంఖ్యలో హాజరై పూజలు నిర్వహిస్తుంటారు. శనివారం హనుమాన్ జయంతి నేపథ్యంలో ఆలయానికి భక్తులు భారీగా రానున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయంలో భక్తులు కాకడ హారతి నిర్వహించారు. సిర్పూర్, కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాలతో పాటు మంచిర్యాల జిల్లాకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో ఉపాధి హామీ నిధుల నుంచి రూ.5 లక్షలతో మంజూరైన సీసీరోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ మాట్లాడుతూ సీసీరోడ్లతో గ్రామాల్లో నూతన శోభ సంతరించుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు జబోరె గణేశ్, చునార్‌కార్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీర హనుమాన్ శోభాయాత్ర



గోలేటిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గురువారం రాత్రి హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు వీర హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. హనుమాన్ జయంతి ముందస్తు ఉత్సవాల్లో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లోని ప్రధాన రహదారితో పాటు కార్మిక కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. దారి వెంట భక్తి గీతాలను ఆలపిస్తూ జై శ్రీరాం, జై హన్‌మాన్ నామ స్మరణలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు గుల్బం చక్రపాణి, పోటు శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రవీందర్, స్వామి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

వాంకిడి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులు పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని జైత్‌పూర్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేస్తే విడతల వారీగా ప్రభుత్వం నుంచి డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్ కుమార్ ఉన్నారు.

కూలీలకు సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధిహామీ పనుల ప్రదేశంలో కూలీలకు సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని కోయవాగు గ్రామపంచాయతీలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన ఫారంపాండ్ పనులను డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కూలీలకు వందరోజుల పని కల్పించడంతోపాటు తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేపట్టాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. యువత రాజీవ్ యువ వికాసం పథకానికి ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం చింతగూడలోని నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించే పార్టీ కాంగ్రెస్

- ఎమ్మెల్సీ దండె విఠల్



చింతలమానెపల్లి: రుద్రాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానెపల్లి: ప్రజల హక్కులను కాపాడుతూ రాజ్యాంగాన్ని రక్షించే పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం రుద్రాపూర్, చింతలమానెపల్లిలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రపతిని కలిసి నివేదించనున్నట్లు తెలిపారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మండల పార్టీ కన్వీనర్ సుల్కరి ఉమామహేష్, మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, మాజీ సర్పంచ్ పెరుగు వందన, నాయకులు అర్షద్ హుస్సేన్, లోడెల్లి ప్రవీణ్, కొండు శంకర్, మేకల జనార్ధన్, జునుగరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం'

బెజ్జూర్: కొందరు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బారెగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన స్వేచ్ఛ, సామాజిక సమానత్వాన్ని బీజేపీ ప్రభుత్వం నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వీధుల గుండా ర్యాలీ సాగించారు. అనంతరం కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, రేణిగుంట్ల పెంటయ్య, రాణా సింగ్, నారాయణ, సామల రాజన్న, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కెరమెరి: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద గ్రామ పంచాయతీలైన పరంధోళి, ముకదంగూడల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తోందని, దీన్ని సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుత్‌బొద్దీన్, జలపతిరావు, శేశారావు, మధూకర్, కేశవ్, రవి, లింబారావు, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు అలవాటు పడొద్దు

వాంకిడి: గ్రామీణ యువకులు గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై ప్రశాంత్ అన్నారు. బుధవారం రాత్రి బంబారలో ఆసిఫాబాద్ పోలీస్ జాగృతి కళా బృందం వారిచే కళాజాత నిర్వహించారు. ఆట, పాటలతో అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ యువత చదువు, క్రీడలపై దృష్టి సారించి ఉత్తమ భవిష్యత్తుకు కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. క్షణికావేశాల్లో ఆత్మహత్యలు చేసుకోవడం, అతివేగంతో రోడ్డు ప్రమాదాలకు గురి కావడంతో కుటుంబాల్లో తీవ్ర శోకం మిగులుతుందన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బెజ్జూర్: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండల కేంద్రం సమీపంలో గురువారం బెజ్జూర్ యూత్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హకీమ్, జలపతి, వెంకటేశ్, నాయకులు డోకే వెంకన్న, బషారత్ ఖాన్, సిడాం సకారాం, హనుమంతు, ఆర్యవైశ్య సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సతీశ్ కుమార్, తంగడపల్లి, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారికి సన్మానం



శరత్‌కుమార్ దంపతులకు మొక్క అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాకు వచ్చిన కేంద్ర పర్యావరణ, అటవీ క్లైమెట్ చేంజ్ మంత్రిత్వశాఖ అడ్వైజర్, జాయింట్ సెక్రెటరీ పల్లెర్ల శరత్‌కుమార్‌ను గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. శరత్‌కుమార్ గతంలో బెల్లంపల్లి ఏరియా ఎన్విరాన్‌మెంట్ అధికారిగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఏరియాతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ పనిచేసిన అనుభవాన్ని అధికారులకు వివరించారు. శరత్ కుమార్ దంపతులకు ఏరియా అధికారులు మొక్క అందించారు. ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకులం తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను గురువారం బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రెటరీ తిరుపతి తనిఖీ చేశారు. డార్మెంటరీ, వంటశాల, సరుకులు పరిశీలించారు. విద్యార్థినుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్-వాంకిడి మండలాల మధ్య మెట్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మెట్‌పల్లి వాగును ఆయన సందర్శించి మాట్లాడారు. వంతెన లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ నిర్మాణాన్ని ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ వంతెన నిర్మాణం వల్ల కాగజ్‌నగర్, వాంకిడి తదితర మండలాల్లోని గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.